# ఉత్తరాయణం!

– బి.వి.శేషమాంబ

ఆఫీసునుంచి ఇంట్లోకి రాగానే నా దృష్టిని ఆకర్షించాయి నేలమీద పడున్న రెండు కవర్లు, ఓ ఇన్‌లాండ్ లెటర్. వాటిని అపురూపంగా ఏరుకుని టేబుల్ మీదపెట్టాను. అప్పుడే వాటిని చదవాలనే కోరికని బలవంతంగా వాయిదా వేసుకుని ముందు ఫ్రెష్ అయ్యాను. తర్వాత చిక్కటి వేడి వేడి కాఫీ కప్పునిండా నింపుకుని రైటింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాను.

అప్పుడే చీకటి పడుతోంది. కిటికీ పక్కనే టేబుల్ ఉండడంతో చల్లటి గాలి శరీరానికి హాయిగా తగులుతోంది. కిటికీ ప్రక్కనున్న నైట్‌క్వీన్ అప్పుడే సువాసనలు వెదజల్లడం ప్రారంభించింది. చంద్రుడు కూడా అదే సమయానికి వెన్నెల పరచడానికి సమాయత్తమౌతున్నాడు. టేప్‌లోంచి 'మనసున మల్లెల మాలలూగెనె' అంటూ భానుమతి కమ్మగా ఆలపిస్తోంది. ఇంక ఆ పాట అర గంటదాకా ఆగదు. కాసెట్లో ఒకవైపంతా అదే పాట వుంది. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించుకుని అప్పుడు ఉత్తరాలు చదవడానికి ఉపక్రమించాను.

ఉత్తరాలన్నీ చదివి రెండిటికి జవాబులు వ్రాసాను. ఆ తర్వాత మూడ్ మారిపోయి ట్యూబ్‌లైట్ ఆఫ్‌చేసి కిటికీ దగ్గరున్న ఈజీఛైర్‌లో పడుకుని చిన్నగా ఊగుతూ పాటని ఆస్వాదించసాగాను. ఎంత బావుంటుందో ఈ పాట? నిజంగా మనసున మల్లెల మాలలు ఊగడం ఎంత చక్కటి భావన.

ఇంతలో తలుపు శబ్దమయింది. మురళే అయ్యుంటాడు. కదిలే ప్రయత్నం చేయలేదు నేను.

''కృష్ణా!'' అనుకుంటూ లోపలికొచ్చాడు మురళి. వస్తూనే లైట్ స్విచ్ వేసాడు. ఇంతలో టేప్ ఆగిపోయింది.

''ఇలా చీకట్లో కూర్చోవద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు?'' కోపంగా అన్నాడు.

''చీకటేముందిరా కిటికీలోంచి ఎంత వెన్నెల వస్తోందో చూడు'' అన్నాను చిన్నగా నవ్వుతూ.

''నీదెప్పుడూ విపరీత ధోరణే. కరెంట్ పోయినప్పుడు వెన్నెలతో సరిపెట్టుకోవాలి. కరెంట్ వున్నప్పుడు లైట్ వేసుకోక నీకిదేం పిచ్చో నాకర్థంకాదు'' అన్నాడు మురళి కుర్చీలో కూర్చుంటూ.

''ట్యూబ్‌లైట్‌కీ, వెన్నెలకీ పోలికా?'' అన్నాను.

''ఔను. రెండింటికీ పోలికేంటి? ట్యూబ్‌లైట్ వెలుగులో పట్టపగల్లా ఉంటాయి పరిసరాలు'' అన్నాడు ఊరుకోకుండా.

''పట్టపగలుకి, వెన్నెల రాత్రికీ తేడా నీకు తెలియదులే. కానీ ఏమిటీ విశేషాలు?'' అనడిగాను టాపిక్ మార్చడానికి.

''నిన్న డిసెంబర్ 31 కదా. రాత్రంతా ఏం ఎంజాయ్‌మెంటనుకున్నావు యూత్‌క్లబ్‌లో. నిన్నూ రమ్మంటే రాలేదు'' అన్నాడు నిష్టూరంగా.

''నేనలాంటివి ఎంజాయ్ చేయలేనని నీకు తెలుసుకదరా! నిష్టూరాలెందుకు?'' అన్నాను.

''అలాంటివి అంటే ఎలాంటివి? అక్కడికి నువ్వేదో గుడ్‌బోయ్, నేనేమో బాడ్‌బాయ్‌నైనట్టు'' ఉడుకున్నాడు మురళి.

''నువ్వు బాడ్‌బాయ్ అని నేనన్నానా? నువ్వు నవయువకుడివి. నవతరానికి ప్రతినిధివి. నేనేమో ఇరవైలో అరవైగాడిని'' అన్నాను నవ్వుతూ.

''అదే వద్దన్నాను. నువ్వట్లా మందకొడిగా ఎందుకుంటావు? హుషారుగా ఉండరా అని ఎన్నిసార్లు చెప్పాను. నాతోపాటు తిరగమని కూడా చెప్తుంటాను'' అన్నాడు.

''గలగల పారే సెలయేరు ఎంత ఆనందాన్ని అనుభవిస్తుందో, నిశ్శబ్దంగా ప్రవహించే నీరూ అంతే ఆనందాన్ని అనుభవిస్తుంది'' అన్నాను వాడినింకా ఉడికించాలని.

''నీతో వాదించడానికి రాలేదు. కొత్త సంవత్సరంలో నీతో కాసేపు స్పెండ్ చేయాలని వచ్చాను'' అన్నాడు అసలు విషయానికి వస్తూ.

''థాంక్సురా. నీ బిజీలో కూడా నన్ను గుర్తు పెట్టుకున్నందుకు'' అన్నాను ఆనందంగా.

''పద పద నీకు హోటల్‌లో మంచి డిన్నర్ ఇస్తాను'' అన్నాడు.

సడెన్‌గా ఆకలి గుర్తుకువచ్చింది నాకు.

''భోజనం సంగతి భలే గుర్తు చేసావురా. పద పద ఆకలి దంచేస్తోంది'' అన్నాను.

''మరీ అంతగా ఆకలిదప్పులు మరచిపోయి నువ్వు వెలగబెడుతున్న రాచకార్యాలేంటి? అని ''వెళ్తూ మాట్లాడుకుందాంలే పద'' అన్నాడు.

ఐదు నిముషాల్లో రెడీ అయి ఇంటికి తాళంవేసి బయల్దేరాం. వాడేదో మాట్లాడుతూనే వున్నాడు గలగలా.

ఒక్కోసారి చాలా ఆశ్చర్యమనిపిస్తుంది మురళికి నాకు స్నేహం ఎలా కుదిరిందని ఆలోచిస్తే. మా మనస్తత్వాలు వేరు. అభిరుచులు వేరు. పెరిగిన వాతావరణం వేరు. ఆర్థిక స్థోమతలు వేరు. విభిన్న వ్యక్తులమైన మమ్మల్ని కలిపిన అంశం ఏమిటో అర్థంకాదు. కేవలం ఒకరంటే ఒకరికి ఇష్టం.

చిన్నప్పట్నించీ నాకు సినిమా పాటలన్నా, లలిత సంగీతమన్నా ఆసక్తి ఉండేది. అన్నిరకాల పాటలు పాడుతుండేవాడిని. పాటలంటే చెవి కోసుకునేవాడు మురళి. బహుశా మా మధ్య లింక్ అదే అయ్యుండవచ్చు. వాడికి ఎప్పుడు పాటలు వినాలనిపించినా వచ్చేసేవాడు. పాడమని ప్రాణం తీసేవాడు.

వాడి ఫ్రెండ్ సర్కిల్ వేరు. నాకసలు సర్కిలే లేదు. నేనే నా చుట్టూ సర్కిల్ గీచుకుని అందులోంచి బైటికి రాకుండా అందులోనే ఆనందం వెతుక్కునేవాడిని. మురళీ, నేను ఒకటో క్లాసు నుంచి క్లాస్‌మేట్స్‌మి. వయసుతోపాటు స్నేహం కూడా పెరిగింది.

నేను చిన్నతనంనుంచే మా మేనత్త దగ్గరే పెరిగాను. తల్లీదండ్రీ నాకు ఊహ తెలియకముందే పోయారు. మా మేనత్త చిన్నతనంలోనే భర్తని కోల్పోయింది. తనకి పిల్లల్లేరు. మేమిద్దరరమే తప్ప మాకు చెప్పుకోదగ్గ బంధువులు లేరు. ఆర్థికంగా ఇబ్బంది ఉండేదికాదు. డిగ్రీతో చదువు ఆపేసి బాంక్ టెస్ట్ పాసై ఉద్యోగం సంపాదించాను. ఉద్యోగం రాకముందే మేనత్తపోయింది. దాంతో వున్న ఒక్క తోడూ కరువయింది.

మొదట్నుంచీ కూడా మితభాషినైన నేను పుస్తకాలు బాగా చదువుతుండేవాడిని. నా భావాలు పంచుకోవడానికి ఓ ఫ్రెండ్ కావాలని బలంగా అనిపించేది. మురళి నాకు మంచి స్నేహితుడేగానీ నా భావాల్ని పంచుకునే టేస్ట్, ఇంట్రెస్ట్ అతనికి లేవు. అప్పుడప్పుడు కథలు, కవితలు రాస్తుండేవాడు. స్నేహంకోసం అల్లాడిపోతూ కలం స్నేహం శీర్షికలకి నా వివరాలు పంపించాను. కానీ నేనాశించిన రెస్పాన్స్ రాలేదు. అమ్మాయి పేరుతో ప్రయత్నించి చూద్దామని అనిపించింది. అలా అనుకోవడంలో నా స్వార్థం మంచి స్నేహితుల్ని ఆకర్షించడం మాత్రమే.

అపరిచితులతో స్నేహం చేయాలంటే ఎవరినైనా ముందుగా ఆకర్షించాల్సింది రూపం. అందుకే అమ్మాయి ఫోటోతో నాకెంతో ఇష్టమైన ప్రియాంక పేరుతో నా వివరాలు పంపించాను. ఈసారి నేను సక్సెస్ అయ్యాను. రెస్పాన్స్ బాగుంది.

నేను నోటితో చెప్పలేని ఎన్నో కబుర్లు కలం పట్టుకోగానే ఊరుతుంటాయి. అటువంటి మాటకారితనం నాకుంటే నాకూ చాలామంది ఫ్రెండ్స్ ఉండేవాళ్ళు. నాకీ ఒంటరితనం తప్పేది. కేవలం వంటరితనాన్ని దూరం చేసుకుని స్నేహంతో సేద తీరాలనే తప్ప నాకెలాంటి దురుద్దేశం

లేదు. అమ్మాయి పేరుతో ఉత్తరాలు రాసి ఆడపిల్లలతో స్నేహం చేయ్యాలనిగానీ, మగపిల్లల్ని ఆకర్షించి ఆడించాలనిగానీ నా ఉద్దేశ్యం కాదు. నా భావాలను, అనుభూతులనూ పంచుకునే స్నేహం కోసం మాత్రమే తాపత్రయపడ్డాను.

స్నేహలత బలంగా పెరిగి గాఢంగా అల్లుకున్నాక, నా ఐడెంటిటీ స్నేహానికి ఆటంకం కాదని నమ్మకం కుదిరాక అసలు సంగతి చెప్పి స్నేహితులకి క్షమాపణ చెప్పాలని అనుకున్నాను. స్నేహానికి కావల్సింది మనసులు, అభిరుచులే కదా! ఆడైతేనేం, మగైతేనేం అనుకున్నాను.

హోటల్లోకి వెళ్లాక స్పెషల్‌మీల్స్‌కి ఆర్డరిచ్చి రిలాక్సింగ్‌గా కుర్చీలో వెనక్కి వాలి ''ఇప్పుడు చెప్పు నీ సంగతి'' అన్నాడు మురళి.

నేను కలం స్నేహానికి అమ్మాయి ఫోటో పంపించడం గురించి చెప్పాను. వాడు కుతూహలంతో అంతా విని ''బాగానే వుంది. ఇప్పుడు నీకొచ్చిన ప్రాబ్లం ఏమిటి?'' అన్నాడు.

''నాకు లెటర్స్ వ్రాసే ప్రియతమ్ నాకొక సమస్య తెచ్చిపెట్టాడు. ఇది చదువు'' అంటూ వాడికో లెటర్ అందించాను.

''ప్రియాంకగారూ!

మన రెండు నెలల పరిచయంలో నా గురించి మీకు చాలా విషయాలు చెప్పాను. మీతో ఎందుకు పరిచయం పెంచుకున్నాననే దానికి ముఖ్యకారణం ఒకటుంది. అది, నేనెంతగానో ప్రేమించి పెళ్లి చేసుకోబోయే సమయానికి మృత్యువాత పడిన సుమకీ మీకూ పోలికలుండడం. నా మాటలు మీరు నమ్మడానికి రుజువుగా సుమ ఫోటో పంపిస్తున్నాను. కాకపోతే సుమ కొంచెం మోడ్రన్. మీరు కొంచెం ఓల్డ్ ఫాషన్డ్. మీతో పర్సనల్‌గా మాట్లాడడానికి త్వరలో వస్తాను.

మీ

ప్రియతమ్

''సుమ ఫోటో ఏదిరా?'' ఆత్రంగా అడిగాడు మురళి.

వాడి ఆత్రానికి నవ్వొచ్చింది నాకు. ఫోటో ఇచ్చాను.

'అరె అచ్చం మా పిన్నిలాగే ఉంది'' అన్నాడు.

''మీ పిన్ని యంగ్‌గా వున్నప్పటి ఫోటో చాలా బ్యూటిఫుల్‌గా వుందని తీసుకున్నాను గుర్తుందా? ఆమే ప్రియాంక'' అన్నాను.

''ఓర్నీ! ఆ ఫోటోతో నువ్వు చేసిన ఘనకార్యం ఇదా? నిజంగానే ఇద్దరికీ బాగా పోలికలున్నాయి. గంగా-మంగా, సీతా ఔర్ గీతా లాగా వున్నారు'' అన్నాడు.

''ఇప్పుడు చెప్పు నేనేం చేయను?'' అడిగాను.


''అసలు సంగతి చెప్పేయ్'' అన్నాడు చాలా తేలిగ్గా.

''భయమేస్తోందిరా. అసలే చాలా సెన్సిటివ్‌లాగున్నాడు. బాగా ఫీలౌతాడేమో?'' అన్నాను దిగులుగా.

''పోనీ ఓ పని చేయ్. అతను వచ్చాక ప్రియాంక పెళ్లి చేసుకుని ఫారిన్ వెళ్లిపోయిందనో, చచ్చిపోయిందనో చెప్పేయ్'' అన్నాడు.

''ఇప్పటికే ఒక అబద్ధంతో అతనిని రాంగ్ ట్రాక్‌లో పడేశాను. ఇంకా అబద్ధాలా?'' అన్నాను.

''ఇంక నీ ఇష్టం. ముందైతే తిండి సంగతి చూడు'' అన్నాడు. ఇంక టాపిక్ అంతటితో ఆగిపోయింది.



• • •

ప్రియతమ్‌ని ఎలా ఫేస్ చేయాలో నేను నిర్ణయించుకోకముందే వారంరోజులు గడిచిపోయినా అతన్నుంచి లెటర్ కూడా రాలేదు. ఆ తర్వాత నేను కూడా తాత్కాలికంగా ఆ విషయం మరచిపోయాను.

ఆ రోజు నేను ఇంటికి వచ్చేసరికి ఒకే ఒక్క లెటర్ వచ్చింది. ప్రియతమేమోనని గుండె దడదడలాడింది. కానీ రైటింగ్ కొత్తగా వుంది. ఎవ్వరై వుంటారో? ఇంకో కొత్త ఫ్రెండ్ కాదుకదా? ఎందుకో ప్రియతమ్ ఆఖరి లెటర్ తరువాత కొత్తగా ఎవ్వరైనా ఫ్రెండ్స్ అవుతారంటే భయమేస్తోంది ఆ పరిచయం ఎలా పరిణమిస్తుందోనని. వెంటనే లెటర్‌ని ఓపెన్ చేసాను.

''తల్లీ ప్రియాంకా!'' ఆ సంబోధనకి ఆశ్చర్యపోయి క్షణం ఆగాను. 'ఇంకోసమస్యలో ఇరుక్కోను కదా' అనుకున్నాను. మళ్లీ అక్షరాల వెంట కళ్ళు పరుగులు తీసాయి.

తల్లీప్రియాంకా!

నువ్వు నిండు నూరేళ్ళు సుఖంగా ఉండమ్మా.

అసలు నేనెవరో నీకు తెలీదు కదూ. నేను ప్రియతమ్ తండ్రిని. రెండేళ్ళుగా వాడు సుమ తలపుల్లోనే పిచ్చివాడైపోతున్న సమయంలో నీ ఫోటో చూసి నీకు సుమకి పోలికల కారణంగా నీతో స్నేహం మొదలుపెట్టాడు. ఆ క్షణం నుండి వాడు ఉత్సాహంగా తిరుగుతుంటే కారణం తెలీకపోయినా మేమెంతో సంతోషించాం. కానీ మా సంతోషం ఎంతోకాలం నిలువలేదు. ప్రియతమ్‌కి రోడ్ యాక్సిడెంట్‌లో నూరేళ్ళు నిండాయి.

ఓ క్షణం గుండె ఆగినంత పనయింది. ప్రియతమ్ చనిపోయాడంటే నమ్మలేకపోతున్నాను. మళ్లీ ఉత్తరం మీదకి బలవంతంగా దృష్టి మళ్లించాను.

''మీ స్నేహం గురించి, అది వాడిలో తిరిగి ఉత్సాహాన్ని నింపి జీవితం మీద ఆశ చిగురింపజేసిన విధం, వాడు నీకు వ్రాసిన ప్రతి ఉత్తరంలోని సారాంశం, వాడి డైరీ ద్వారా తెలుసుకున్నాను. ఒక విధంగా వాడు అదృష్టవంతుడు. జీవితంలో చివరి రెండునెలలు ఆనందంగా బ్రతికాడు. దానికి కారణమైన నీకు కృతజ్ఞతలు చెప్పడానికే ఈ ఉత్తరం రాస్తున్నాను.''

ఆ రోజువరకూ అబద్ధమాడి ప్రియతమ్ మనసుతో ఆడుకున్నానేమో అని బాధపడుతున్న నాకు ప్రియతమ్ మరణం పెద్ద షాక్ అయింది. మళ్లీ ఒంటరిగా కుర్చీలో కూర్చున్నాను.

'తలచినది జరిగినదా దైవం ఎందులకు...జరిగినదే తలచితివా శాంతి లేదు నీకు...' అనే పాట వినిపిస్తోంది.

★